సాక్షి
ఖమ్మం

ఆదివారం । 9 । జూన్ । 2024



'భగీరథ' నీరు వస్తోందా?!

మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి సరఫరాలో అవాంతరాలేమైనా ఉన్నాయో తెలుసుకునేందుకు సర్వే చేపట్టనున్నారు. 8లో



'గానలహరి' ప్రారంభం

రికార్డు నెలకొల్పడమే లక్ష్యంగా 32గంటల పాటు కొనసాగనున్న 'గానలహరి' కార్యక్రమం ఖమ్మంలో శనివారం ప్రారంభమైంది. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 26°

వాతావరణం

జిల్లాలో ఆదివారం వాతావరణం చల్లగానే ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

సమగ్ర యాజమాన్యమే కీలకం

తద్వారా ఉత్తమ దిగుబడితో లాభాల పంట

- నేల రకాల ఆధారంగా ధ్రువీకరించిన విత్తనాల ఎంపికే ముఖ్యం
- పత్తిలో రెండు, మూడు రకాల సాగు మేలు
- వరిలో సన్న రకాలను విత్తుకోవచ్చు..
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

సాక్షి ఫోన్ ఇన్



'సాక్షి' ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

ఫోన్ ఇన్‌లో పాల్గొన్న వ్యవసాయ, ఉద్యాన శాఖ జిల్లా అధికారులు

ఖమ్మంవ్యవసాయం: సమగ్ర యాజమాన్య విధానాలను అవలంబిస్తే పంటల్లో ఆశాజనకమైన దిగుబడి సాధించొచ్చని.. ఇదే సమయాన సరైన విత్తనాలను ఎంచుకోవడం కూడా కీలకమేనని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల వెల్లడించారు. వానాకాలం పంటల సీజన్ సమీపిస్తున్న నేపథ్యాన విత్తనాల ఎంపిక, సాగులో పాటించాల్సిన మెళకువలపై రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు 'సాక్షి' ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన ఫోన్ ఇన్‌లో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో రైతులు ఫోన్ చేసి అడిగిన ప్రశ్నలకు డీఏఓ సమాధానాలు చెప్పడంతో పాటు సలహాలు ఇచ్చారు. ప్రభుత్వ ధ్రువీకరణ పొందిన కంపెనీల విత్తనాలను లైసెన్సు పొందిన డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని, ఆపై పంట చేతికి వచ్చేవరకు బిల్లులు భద్రపర్చుకోవాలని సూచించారు. పత్తి, పెసర, కందితో పాటు వరిలో ఏయే రకాలను ఏయే సమయాన వేయాలి, అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు, మిర్చిలో ఎండు తెగులు, తామర పురుగును తట్టుకునే రకాలు, వరిలో వెదజల్లే పద్ధతులను కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో డీఏఓ విజయనిర్మలతో పాటు జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమాభివృద్ధి అధికారి బీ.వీ.రమణ, ఏడీఏలు ఎస్.విజయ్‌చందర్, బి.సరిత, శ్రీనివాస్‌రెడ్డి సైతం రైతుల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈమేరకు పలువురు రైతులు అడిగిన ప్రశ్నలు, అధికారుల సమాధానాలు ఇలా ఉన్నాయి.

▶▶ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పెసలు చల్లుకోవచ్చా, విత్తనాలు ఎక్కడ లభిస్తాయి?

– ఆవుల ప్రమీల, బాణాపురం, ముదిగొండ మండలం

జవాబు : దుక్కులు సిద్ధం చేసుకుని 60 మి.మీ.ల వర్షపాతం నమోదయ్యాకే విత్తుకోవాలి. పెసలను కూడా చల్లుకోవచ్చు. పీఏసీఎస్‌ల ద్వారా తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ అపరాల విత్తనాలను విక్రయిస్తోంది.

▶▶ పత్తిలో తుంగ సమస్య ఎలా పరిష్కరించుకోవాలి? కంది ఎకరాకు ఎన్ని కిలోల విత్తనాలను విత్తాలి, విత్తనాలు ఎక్కడ లభిస్తాయి?

– మునగాల రాజశేఖర్‌రెడ్డి, సిద్దినేనిగూడెం, మధిర మండలం

జ: బసగ్రాన్ అనే మందును పత్తి మొక్కలపై పడకుండా పిచికారీ చేయాలి. కంది ఎకరాకు 2 నుంచి 3 కిలోల వరకు విత్తాలి. తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ సహకార సంఘాల ద్వారా విత్తనాలు విక్రయిస్తోంది.

▶▶ వరి సన్న రకాల్లో మేలైనవి తెలపండి.

– జి.రామారావు, సుర్దేపల్లి, మల్లెబోయిన ఉపేందర్, బైరవునిపల్లి, వెంకటేశ్వర్లు, గంధసిరి

జ: బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సాంబ, కేఎన్ఎం 118, సిద్ధి, చింటు, పూజ, జైశ్రీరాం, వరంగల్ విత్తన రకాలను ఎంపిక చేసుకోవచ్చు. ఈ రకాలన్నీ 135 నుంచి 150 రోజుల్లో చేతికొస్తాయి.

▶▶ పత్తిలో కొన్ని రకాల విత్తనాలు లేవని వ్యాపారులు చెబుతున్నారు. కొందరేమో అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

– శ్రీకాంత్, కొండాపురం, ఖమ్మం రూరల్ మండలం

జ: పత్తి విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే సహించేది లేదు. ఆశించిన రకం విత్తనాలు లభించటం లేదని ఆందోళన చెందొద్దు. అనుమతించిన విత్తన రకాలన్నీ ఉత్తమ దిగుబడులనిస్తాయి. అధిక ధరలకు విక్రయించే డిస్ట్రిబ్యూటర్ వివరాలపై ఫిర్యాదు చేయండి. ఈ విషయంలో టాస్క్‌ఫోర్సు బృందాలు తనిఖీ చేస్తున్నాయి.

▶▶ పత్తిలో యూఎస్ పేరిట ఉన్న ఒక రకం విత్తనాలు లభించడం లేదు. విత్తన వ్యాపారులు తక్కువగా వచ్చాయని చెబుతున్నారు. అవి ఎక్కడ లభిస్తాయి?

– వీరయ్య, నేలకొండపల్లి

జ: పత్తిలో బీజీ–2 విత్తన రకాలు అనేకంగా ఉన్నాయి. ఏదైనా సమాన దిగుబడి వస్తుంది. అందువల్ల ఒకే రకంపై ఆధారపడొద్దు. నేల రకం, యాజమాన్య పద్ధతులపై దిగుబడి ఆధారపడి ఉంటుంది. రెండు, మూడు రకాల విత్తనాలను ఎంచుకుని సాగు చేయాలి.

▶▶ మిరపలో ఎండు తెగులును ఎలా నివారించుకోవాలి? మిర్చి నారు ఎలా పెంచితే మంచిది?

– మరికంటి వెంకటేశ్వర్లు, బాణాపురం, ముదిగొండ మండలం, సాదం రాంబాబు, మాటూరిపేట, మధిర మండలం

జ: ట్రైకోడెర్మా విరిడితో మిరపలో ఎండు తెగులు నివారించుకోవచ్చు. ఖమ్మం గట్టయ్యసెంటర్‌లోని జీవ నియంత్రణ ప్రయోగశాలలో ఇది లభిస్తుంది. మిర్చి విత్తనశుద్ధి ఎంతో ముఖ్యం. ట్రైసోడియం ఆర్థో పాస్పేట్ 150 గ్రాములను విత్తనంలో కలిపి శుద్ధి చేసుకొని నారు పోసుకుంటే మంచింది.

▶▶ పత్తిని ఎంత పదునులో విత్తుకోవచ్చు. ఏయే రకాలు మంచివి? – కొమ్మూరి స్వాతి, ముదిగొండ

జ: 60 నుంచి 70 మి.మీల వర్షపాతం నమోదయ్యాకే పత్తి విత్తుకోవచ్చు. పదునులో విత్తితేనే తగిన మొలకశాతం ఉంటుంది. అనుమతి ఉన్న విత్తనాలన్నీ మంచి దిగుబడులనే ఇస్తాయి. రెండు, మూడు రకాలను విత్తుకుంటే మంచిది.

▶▶ సబ్సిడీపై అపరాలు, వరి విత్తనాలను విక్రయిస్తున్నారా, ఎక్కడ లభిస్తాయి?

– సిరసవాడ వెంకటేశ్వర్లు, ఎద్దులచెరువు, తిరుమలాయపాలెం మండలం

జ: అపరాలు, వరి విత్తనాలపై సబ్సిడీ లేదు. తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ ఈ విత్తనాలను అందుబాటులోకి తీసుకువస్తుంది. సహకార సంఘాలు, ఎంపిక చేసిన ఆగ్రో సేవా కేంద్రాల ద్వారా విక్రయిస్తారు.

▶▶ వరిలో ఎంటీయూ 1061 రకం విత్తుకోవచ్చా. ఈ రకానికి ప్రభుత్వం బోనస్ ఇస్తుందా?

– భూక్యా చలపతిరావు, కొండ్రుపాడు, పెనుబల్లి మండలం

జ: సన్న రకాలకు ప్రభుత్వం బోనస్ ఇస్తుంది. అయితే, ఏయే రకాలకు బోనస్ అనేది సమాచారం రావాల్సి ఉంది. సమాచారం వచ్చాక తెలియజేస్తాం.

▶▶ చౌడు నేలల్లో విత్తుకోవాల్సిన వరి రకాలను వివరించండి.

– ఏలూరి వెంకటరావు, కొక్కిరేణి, తిరుమలాయపాలెం మండలం

జ: ఆర్ఎన్ఆర్ 11718, కేపీఎస్–2874, ఎస్ఎల్ఆర్– 3449 వంటి రకాలను ఎంపిక చేసుకోవచ్చు.

▶▶ పత్తిలో పుచ్చు రాకుండా ఉండే రకాలను తెలపండి.

– సామినేని లక్ష్మణ్‌రావు, మాటూరుపేట, మధిర మండలం

జ: పంట దగ్గరగా విత్తుకోవాలి. అధిక సాంద్రత పద్ధతిని ఎంపిక చేసుకోవాలి. పుచ్చుకు కారణం గులాబీ రంగు పురుగు. లింగాకర్షక బుట్టలను ఎక్కువగా ఏర్పాటు చేసుకోవాలి. నవంబర్, డిసెంబర్ నాటికి రెండు పంటలు వస్తాయి. ఆ తర్వాత నీటి లభ్యత ఆధారంగా మరో పంట సాగు చేసుకోవచ్చు.

▶▶ జీలుగులు, జనుములు, పిల్లిపెసర విత్తనాలు లభించడం లేదు.

– అయినాల కనకరత్నం, కేజీ సిరిపురం, వైరా మండలం, వెంకటరామారావు, అన్నారుగూడెం, తల్లాడ మండలం

జ: తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ పీఏసీఎస్‌ల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలను విక్రయిస్తోంది. అక్కడ సంప్రదించండి. సంస్థ అధికారులతో మాట్లాడి అందుబాటులో వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

▶▶ దోమపోటును తట్టుకునే వరి రకాలను వివరించండి.

– నరసింహారావు, మల్లకుంట, పెనుబల్లి మండలం

జ: ఆర్ఎన్ఆర్ 28361, వరంగల్ 915, 1487, 11718, జగిత్యాల 28545 వంటి రకాలకు దోమపోటును కొంత మేర తట్టుకునే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష

మధిర: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదివారం మధిరలో పర్యటించనున్నారు. ఈమేరకు ఆయన తొలుత మధిరలోని క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు. అనంతరం మధిరలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మున్సిపాలిటీ, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తారు. ఆతర్వాత మరికొన్ని కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం భట్టి పాల్గొంటారు.

జమలాపురంలో నిత్యకల్యాణం, పల్లకీసేవ



ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామున స్వామి మూలవిరాట్‌తో పాటు శ్రీవారి పాదానికి అర్చకులు పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆతర్వాత స్వామి, అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్య కల్యాణం, పల్లకీసేవ నిర్వహించారు. పూజలకు తెలంగాణ ఏపీలోని వివిధ ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈవో జగన్మోహన్ రావు, చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, సూపరింటిండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు, బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు నాలుగు విడతల డీఏలతో పాటు ఈ–కుబేర్‌లో పెండింగ్ ఉన్న జీపీఎఫ్, టీఎస్ జీఎల్ఐ లోన్లు, పార్ట్ ఫైనల్స్ చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య డిమాండ్ చేశారు. ఖమ్మంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల కొనసాగింపునకు నిర్ణయించిన ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదేసమయాన ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, విద్యా వలంటీర్లను నియమించాలని కోరారు. ఈసమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చావ దుర్గాభవాని, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, నాయకులు షేక్ మహబూబ్ అలీ, బుర్రి వెంకన్న, షేక్ యూసఫ్ సైదా, వల్లంకొండ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు చేతినిండా పని

- టెస్కో ద్వారా ఇప్పటికే రూ.255కోట్ల విలువైన ఆర్డర్లు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



చేనేత సహకార సంఘాల నాయకులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: చేనేత కార్మికులకు తమ ప్రభుత్వం చేతినిండా పని కల్పిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి, చేనేత సహకార సంఘాల నాయకులు మంత్రిని శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చేనేత సంఘాల్లోని వస్త్ర నిల్వలు కొనుగోలు చేయడమే కాక బకాయిలు చెల్లించాలని వారు కోరారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ గత ప్రభుత్వం చేనేత కార్మికులను పట్టించుకోలేదని, తాము మాత్రం కార్మికులకు దీర్ఘకాలిక లబ్ధిచేకూర్చే పథకాల అమలుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏడాది పొడవునా చేతినిండా పని కల్పిస్తున్నామని, ప్రభుత్వ శాఖలు ప్రైవేట్ మార్కెట్‌లో కాకుండా టెస్కో ద్వారానే వస్త్రాల కొనుగోలుకు జీఓను ఇచ్చామని చెప్పారు. ఇప్పటికే రూ.255కోట్ల విలువైన ఆర్డర్లు టెస్కో ద్వారా చేనేత సంఘాలకు ఇచ్చామని తెలిపారు. అలాగే, గత ప్రభుత్వంలో ఉన్న బకాయిలను సీఎం దృష్టికి తీసుకెళ్లి చెల్లింపునకు కృషి చేస్తానని చెప్పారు. అయితే, 10శాతం యార్న్ సబ్సిడీ పథకాన్ని గత ప్రభుత్వం కేబినెట్ ఆమోదం లేకుండా ప్రవేశపెట్టడంతో నిధుల విడుదల కాకపోయినా రూ.33.23కోట్లు టెస్కో నుండి విడుదల చేశామని మంత్రి గుర్తు చేశారు. ఇక త్వరలోనే చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

లోక్ అదాలత్‌తో మానసిక ప్రశాంతత

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్
- జిల్లావ్యాప్తంగా 11,298 కేసుల పరిష్కారం



రాజీ పడిన వారికి మొక్క అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

ఖమ్మంలీగల్: పెండింగ్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే సమయం, డబ్బు ఆదా కావడమే కాక వెలకట్టలేని మానసిక ప్రశాంతత సొంతమవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ తెలిపారు. రాజీ పడడాన్ని తప్పుగా భావించకుండా రాజమార్గంగా చూడాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం జిల్లా కోర్టులో ప్రారంభించిన ఆయన మాట్లాడారు. దీర్ఘకాలంగా పరిష్కారం కాని కేసులు లోక్ అదాలత్ లో పరిష్కరించుకుంటే సత్వర న్యాయం అందుతుందన్నారు. కేసుల ట్రయల్ పూర్తయి, తీర్పు రావడానికి నిర్దేశిత సమయం ఉండదని, లోక్ అదాలత్‌లోనైతే ఇరు వర్గాలకు న్యాయం, మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారు, సంపాదనాపరుడు మృతి చెందిన కుటుంబాలు ఆర్థికసాయం కోసం ఎదురు చూస్తుంటాయని, అలాంటి కేసులను లోక్ అదాలత్‌తో పరిష్కరించుకుంటే కుటుంబం నిలబడుతుందని న్యాయమూర్తి చెప్పారు. ఈమేరకు రాజీ పడిన దంపతులు, ప్రమాదం కేసులో రాజీ పడి రూ.14లక్షల అవార్డ్ పొందిన పిటిషనర్‌ను జిల్లా జడ్జి అభినందించి మొక్కలు అందజేశారు. అలాగే, ఎక్కువ కేసులు పరిష్కరించడానికి సహకరించిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు ఉద్యోగులను జిల్లా జడ్జి రాజగోపాల్ అభినందించారు. ఈకార్యక్రమంలో న్యాయమూర్తులు కె.ఉమాదేవి, వి.అపర్ణ, డి.రాంప్రసాదరావు, ఎం.అర్చనాకుమారి, కే.వీ.చంద్రశేఖరరావు, కె.దీప, వై.బిందుప్రియ, వి.మాధవి, బి.రజిని పాల్గొనగా, లోక్ అదాలత్ సభ్యులుగా న్యాయవాదులు తెల్లాకుల రమేష్ బాబు, ముప్పా నాగేశ్వరరావు, పి.రంగారావు, మల్సూర్, టి.వెంకటనారాయణ, వి.వాసవీకుమారి తదితరులు వ్యవహరించారు.

రూ.1.47 కోట్ల పరిహారం

జిల్లా జడ్జి రాజగోపాల్ ఆధ్వర్యాన జిల్లావ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్లో 11,298 కేసులు పరిష్కారమయ్యాయి. ఈమేరకు ఏడు బెంచ్‌లను న్యాయసేవా సంస్థ కార్యదర్శి ప్రిన్సిపల్, సీనియర్ సివిల్ జడ్జి కే.వీ.చంద్రశేఖర్‌రావు ఏర్పాటుచేశారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ఉమాదేవి 244 విద్యుత్ చౌర్యం కేసులను పరిష్కరించడంతో పాటు 67 రోడ్డు ప్రమాదాల కేసుల్లో బాధితులకు రూ.1.47 కోట్ల పరిహారం ఇప్పించారు. ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కె.దీప 76, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.రజని 235 క్రిమినల్ కేసులతో పాటు 71 సైబర్ క్రైం కేసులను, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వై.బిందుప్రియ 1,948 కేసులను, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.మాధవి 216 క్రిమినల్ కేసులను, మొబైల్ కోర్టుకు సంబంధించి 418 కేసులను, ఎక్సైజ్ కోర్టుకు చెందిన 66 కేసులను న్యాయమూర్తి బి.రజని, ద్వితీయ శ్రేణి మేజిస్ట్రేట్ సలీం 1,621 పిటీ కేసులను పరిష్కరించగా.. పలు ప్రీ లిటిగేషన్ కేసులు కూడా పరిష్కారమయ్యాయి. ఇక సత్తుపల్లిలో 585 కేసులు, మధిరలో 934 కేసులు పరిష్కారమయ్యాయి. కాగా, ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యాన కక్షిదారులకు పులిహోర, తాగునీరు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు మజ్జిగ అందజేశారు.



జోరుగా చేపల అమ్మకం

మృగశిర కార్తె తొలిరోజున చేపలు తింటే మంచిదన్న నమ్మకంతో శనివారం జిల్లావ్యాప్తంగా అమ్మకాలు జోరుగా సాగాయి. ఇక్కడ సరిపడా చేపల లభ్యత లేకపోవడంతో ఏపీ నుంచి క్వింటాళ్ల మేర వ్యాపారులు జలపుష్పాలను తెప్పించి అమ్మారు. 9లో

నేడు గ్రూప్–1 పరీక్ష

- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం
- జిల్లాలో 52 కేంద్రాలు, 18,403 మంది అభ్యర్థులు
- 10గంటల వరకే అనుమతి

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) ఆధ్వర్యాన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం జరగనుంది. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేలా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. జిల్లాలోని 52 కేంద్రాల్లో ఉదయం 10–30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే పరీక్షకు 18,403మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. అయితే, అభ్యర్థులను 9నుంచి 10గంటల వరకు మాత్రమే అనుమతిస్తారు. ఆతర్వాత కేంద్రాల గేట్లు మూసేసి ఎవరినీ అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. అభ్యర్థుల హాజరును బయోమెట్రిక్ విధానంలో నమోదు చేయనుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఫ్లయింగ్ స్క్వాడ్‌గా సీనియర్ అధికారులు

గ్రూప్–1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించేలా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అధికారులతో ఇప్పటికే పలుమార్లు సమీక్షించి సూచనలు చేశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేయడంతో పాటు సమీపాన జిరాక్స్ సెంటర్లు మూసివేయించాలని పోలీసు శాఖను ఆదేశించారు. అలాగే, జిల్లా స్థాయి సీనియర్ అధికారులతో 13 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 52 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 184 మంది ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లను నియమించారు. అంతేకాక నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, రీజినల్ కోఆర్డినేటర్లుగా ఎస్‌బీఐటీ, విజయ కళాశాలల ప్రిన్సిపాళ్లు రాజ్‌కుమార్, జాన్‌బాబు వ్యవహరిస్తారు. ఏ అధికారికి కూడా సెల్‌ఫోన్ అనుమతి ఉండదని తెలిపారు.

మూడు స్థాయిల్లో తనిఖీలు

పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులను మూడు దశల్లో తనిఖీ చేస్తారు. మొదట పోలీస్ సిబ్బంది, ఆ తర్వాత పరీక్షా కేంద్రం ఉద్యోగులు, ఆపై ఐడెంటిఫికేషన్ అధికారులు తనిఖీ నిర్వర్తిస్తారు. మహిళా అభ్యర్థులను తనిఖీ చేసేందుకు మహిళా సిబ్బందినే కేటాయించారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఒక గుర్తింపు కార్డు తీసుకురావాలి. బూట్లు వేసుకుని వచ్చినా, జ్యూయెలరీ ధరించినా తొలగించాకే అనుమతిస్తారు. వాచీలకు సైతం అనుమతి ఉండదు. పరీక్ష పూర్తయ్యేంత వరకు అభ్యర్థులను బయటకు పంపించరు. అభ్యర్థులు రైటింగ్ ప్యాడ్ కూడా తెచ్చుకోవద్దని సూచించారు.

పెద్దకొడుకుగా సమస్యలన్నీ పరిష్కరిస్తా..

- మూడేళ్లలో పాలేరులో అర్హులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు
- రేపటి కేబినెట్ భేటీలో తీపికబురు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



నాయకన్‌గూడెంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన నాయకులు

కూసుమంచి: గ్రామగ్రామాన ఆదరించి గెలిపించి మంత్రి పదవి రావడానికి కారణమైన పాలేరు ప్రజలకు పెద్ద కొడుకులా ఉంటూ సమస్యలన్నీ పరిష్కరిస్తానని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్ల డించారు. కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పర్యటించిన మంత్రి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారంపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా పలుచోట్ల జరిగిన సమావేశాల్లో పొంగులేటి మాట్లాడుతూ గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్కరికీ రేషన్ కార్డులు ఇవ్వలేదని తెలిపారు. ఫలితంగా అర్హత ఉన్నా అనేక పథకాలు కోల్పోయారని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చేముందు ఇచ్చిన హామీమేరకు అర్హులందరికీ తెల్లరేషన్‌కార్డులతో పా టు ఇందిరమ్మ గృహాలు, ఇంటి స్థలాలు ఇస్తామని ప్రకటించారు. ఈ విషయమై సోమవారం జరిగే కేబినెట్ భేటీలో తీపి కబురు అందిస్తామన్నారు. వచ్చే ఐదేళ్లలో ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాల్సి ఉండగా పాలేరు నియోజకవర్గంలో మూడేళ్లలోనే అర్హులకు నిర్మిస్తామని తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని, ప్రతీ గ్రామంలో సీసీ రహదారులు, డ్రెయినేజీలు నిర్మిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. తాగునీరు, విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే, సాగర్ కాల్వల భూములు ఆక్రమణకు గురికాకుండా ఫెన్సింగ్ వేసి, పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. తనతో పాటు ఎంపీగా రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించినందున పాలేరు ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్, నాయకులు రాయల నాగేశ్వరరావు, కంచర్ల పద్మ, మట్టె గురవయ్య, జూకూరి గోపాలరావు, ఎడవెల్లి ముత్తయ్య, ఎండీ.హఫీజుద్దీన్, జొన్నలగడ్డ రవికుమార్, కొమిరెల్లి అలింగ గోవిందరెడ్డి, మాదాసు ఉపేందర్, వెంకటరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడే జేసీజే మోడల్ పరీక్ష

ఖమ్మంలీగల్: జూనియర్ సివిల్ జడ్జి పరీక్షకు సిద్ధమవుతున్న న్యాయవాదుల కోసం అఖిల భారత న్యాయవాదుల సంఘం(ఐలు) ఆధ్వర్యాన ఆదివారం మోడల్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఖమ్మంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో ఉదయం 10గంటలకు పరీక్ష మొదలవుతుందని ఐలు బాధ్యులు మీసాల వెంకటేశ్వర్లు, నల్లమల నవీన్‌చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా అథ్లెట్లను అభినందించిన డీవైఎస్‌ఓ



పతకాలు సాధించిన అథ్లెట్లతో డీవైఎస్‌ఓ, అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: హనుమకొండలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా అథ్లెట్లు సత్తా చాటారు. జిల్లా క్రీడాకారులు ఎ.మనుశ్రీ, డి.లోహిత, డి.నవ్యశ్రీ, డి.బిందు, కె.మస్తాన్, కె.అఖిల్, ఏ.గౌతమ్, ఎస్.కే.హబీబ్, పి.గోపీచంద్, ఎ.మైథిలి, డి.సింధుప్రియ, హాజీరా ఫాతిమా, వి.వేణు వివిధ విభాగాల్లో సత్తా చాటి పతకాలు గెలుచుకోగా, మహిళల విభాగంలో జిల్లా జట్టుకు చాంపియన్‌షిప్ లభించింది. ఈ సందర్భంగా క్రీడాకారులను శనివారం డీవైఎస్‌ఓ సునీల్‌కుమార్‌రెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్, కోచ్‌లు ఎం.డీ.గౌస్, ఎం.సుధాకర్, రవి, ఎన్. వెంకటేశ్వర్లు, శశి, శ్రీనివాస్, హకీం అభినందించారు.

దైవ మందిరాలకు విరాళం



నగదు అందజేస్తున్న కోటేశ్వరరావు దంపతులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, వ్యాపారి తుళ్లూరి కోటేశ్వరరావు - నిర్మల దంపతులు గ్రామంలో నిర్మిస్తున్న దైవ మందిరాలకు శనివారం విరాళాలు అందచేశారు. జమలాపురంలో నిర్మిస్తున్న సీఎస్ఐ చర్చికి రూ.10లక్షల విలులైన సామగ్రి, ఎస్టీ కాలనీలో సంత్ సేవాలాల్ మహరాజ్ మందిర నిర్మాణానికి రూ.5లక్షల నగదు, సేవాలాల్ కోలాట నత్య సమాజానికి దుస్తులను అందజేయగా, దాతలను పలువురు అభినందించారు. నాయకులు నన్నపనేని రామారావు, వేమిరెడ్డి వెంకటరెడ్డి, వాసిరెడ్డి శివకుమారి, మున్నలూరి మురళీధర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

దొంగల ముఠా అరెస్ట్

కొత్తగూడెంటౌన్: కారులో తిరుగుతూ ఇళ్ల ఎదుట నిలిపి ఉంచిన కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలను అపహరిస్తున్న దొంగల ముఠాను కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కొత్తగూడెం, భద్రాచలం, పాల్వంచల్లో వరుస చోరీలకు పాల్పడిన వ్యక్తుల వద్ద నుంచి మూడు ఆటోలు, కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. శనివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ కరుణాకర్ వివరాలు వెల్లడించారు. వీఎం బంజర్, పెనుబల్లి మండలం లింగగూడెంనకు చెందిన గోపి, శ్రీను 30 ఏళ్ల కిందట చుంచుపల్లి మండలం విద్యానగర్‌కాలనీలో స్థిరపడ్డారు. వీరు తమ ప్రాంతానికే చెందిన ముత్తారావు, శివరాం, కోటయ్య, గద్దల శివ, లక్ష్మణ్‌రావుతోపాటు విద్యానగర్‌కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ కిరణ్‌తో కలిసి ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నారు. ఇంటి ఎదుట నిలిపి ఉంచిన కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలను లక్ష్యంగా చేసుకుని.. భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెంలలో పలు చోరీలకు పాల్పడ్డారు. అలా చోరీచేసిన ఆటోను విక్రయించేందుకు ఆటోతో పాటు కారులో వస్తున్న వీరిని వాహన తనిఖీలు చేస్తున్న వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లు నిందితులు అంగీకరించారని సీఐ కరుణాకర్ తెలిపారు. కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించామని ఆయన వివరించారు.

మిషన్ భగీరథ నీరు వస్తోందా ?!

- ఇంటింటికీ తాగునీటి సరఫరాపై సర్వే
- సమస్యలు, లోపాలపై వివరాల సేకరణ
- రేపటి నుంచి మొదలుకానున్న సర్వే



తిరుమలాపురంలో మిషన్ భగీరథ నీటి సరఫరా వివరాలు తెలుసుకుంటున్న అధికారులు (ఫైల్)

నేలకొండపల్లి: ఇంటింటికీ తాగునీరు అందించేందుకు గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాలో దాదాపు 3 లక్షల ఇళ్లకు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కూడా దాదాపు అదేసంఖ్యలో ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇచ్చారు. ఆపై ఇంటింటికీ తాగునీరు సాఫీగా అందుతోందని అధికారులు నివేదిక సమర్పించారు. కానీ క్షేత్ర స్థాయిలో చాలా ఇళ్లకు నీరు అందడం లేదని, పైపులైన్లు పగిలిపోయి, వాల్వ్‌ల వద్ద లీకేజీలతో నీరు వృథా అవుతోందనే ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపథ్యాన గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతీ ఇంటిని సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పది రోజుల్లోగా ఈ సర్వే పూర్తి చేసి మిషన్ భగీరథ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అంతేకాక కొత్తగా ఏర్పడిన కాలనీల్లో ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇచ్చేలా పైపులైన్లు వేసేందుకు కూడా ఇదే సమయాన సర్వే చేస్తారు. ఈ విషయంలో ఇప్పటికే ఉద్యోగులకు శిక్షణ కూడా ఇవ్వగా.. సోమవారం నుంచి రంగంలోకి దిగనున్నారు.

ఏం సేకరిస్తారంటే...

ప్రతీ ఇంటి యాజమాని పేరు, చిరునామా, కుళాయి ఫొటోలను సర్వేలో భాగంగా తీసుకుంటారు. ఆపై యాజమాని పేరు, చిరునామా, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్ సహా కుటుంబ సభ్యుల వివరాలు, సరిపడా నీళ్లు వస్తున్నాయా లేదా తదితర 11 రకాల వివరాలు సేకరిస్తారు. వీటన్నింటినీ తొలుత గ్రామ, మండల స్థాయిలో క్రోడీకరించి ఆపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తారు. ఈ వివరాలను పారదర్శకంగా ఉండేలా యాప్‌లోనూ ఎప్పటికప్పుడు నమోదు చేస్తారు. ఉద్యోగి ఒక్కొక్కరు ప్రతీరోజు 20 నుంచి 30 ఇళ్ల వరకు సర్వే చేయాలని ఉన్నతాధికారులు సూచించారు.

కొత్త కాలనీలకు శుభవార్తే

భగీరథ నీటిపై సర్వే చేయనున్న అధికారులు కొత్త ఇళ్ల విషయంలోనూ స్పష్టత ఇచ్చారు. నూతన నివాసాలకు నంబర్ కేటాయించినా, లేకున్నా సందర్శించి వివరాలను సేకరిస్తారు. ఫలితంగా గ్రామాల వారీగా ఇంకా ఎన్ని ఇళ్లకు నల్లాలు కావాలి, పైప్‌లైన్ వేయాలనే అంశంపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు. దీంతో ఇన్నాళ్లు తాగునీటికి ఇబ్బంది పడుతున్న వారికి మేలు జరగనుంది. ఈ సర్వే సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభించనుండగా, దాదాపు 3 లక్షల కుటుంబాలను ఉద్యోగులు సందర్శిస్తారు. సర్వేలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు, ఈ పంచాయతీ ఆపరేటర్లు, ఇతర సిబ్బంది పాల్గొననున్నారు. కాగా, సర్వేలో వెల్లడైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం త్వరలోనే విధివిధానాలను ప్రకటించనుందని తెలుస్తోంది.

పది రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక



మిషన్ భగీరథ పథకం నల్లాల ద్వారా నీటి సరఫరా తీరుతెన్నులను తెలుసుకునేందుకు సర్వే చేపట్టనున్నాం. ప్రజలు నీటిని ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారు, ఎక్కడైనా సమస్య ఉందా, ఏదైనా కాలనీలకు నీరు సరఫరా చేయాలనా అనే అంశాలపై పూర్తి వివరాలు సేకరిస్తాం. వీటన్నింటినీ ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి పది రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిస్తాం.

– ఎం.యర్రయ్య, ఎంపీడీఓ, నేలకొండపల్లి

భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు



పైపులైన్ మరమ్మతు చేస్తున్న సిబ్బంది

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు స్టేజీ వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యాన ప్రజలు ఇచ్చిన సమాచారంతో శనివారం సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. మిషన్‌భగీరథ ఏఈ వసంత్ ఆధ్వర్యాన పనులు చేయగా ఆయన మాట్లాడారు. ఎక్కడ కూడా లీకేజీలతో నీరు వృథా కాకుండా మరమ్మతులు చేయిస్తున్నామని తెలిపారు.

సుదీర్ఘ 'గానలహరి' ప్రారంభం

తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన గాయకులు



పాట పాడుతున్న గాయకులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో స్వర మధురిమ కల్చరల్ ఈవెంట్స్ ఆధ్వర్యాన రికార్డు నెలకొల్పాలనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన 32 గంటల సుదీర్ఘ గానలహరి శనివారం ప్రారంభమైంది. వివిధ కళా సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, గాయకులు, ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరుకాగా, తొలుత ఎస్పీ బాలసుబ్రమణ్యం చిత్రపటానికి నివాళులర్పించారు. శనివారం ఉదయం 10గంటలకు మొదలైన కార్యక్రమం ఆదివారం సాయంత్రం వరకు నిర్విరామంగా కొనసాగుతుంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన గాయనీ గాయకులే కాక ఇప్పటికే రికార్డులు నమోదుచేసిన బింగి నరేందర్‌గౌడ్, డాక్టర్ నాగశ్రీ, యడ్ల శ్రీనివాసరావు సైతం పాటలు ఆలపిస్తున్నారు. ఖమ్మం కళా పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి, సాయిశ్రీ డెవలపర్స్ ఎండీ కమర్తపు శ్రీధర్, అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ కార్యదర్శి ఏ.సుబ్రమణ్యకుమార్, గాయకులు పంజా మాలతీనాయుడు, వీవీ.రెడ్డి, స్వర మధురిమ కల్చరల్ అధ్యక్షుడు ఇసనపల్లి నగేష్ తదితరులు పాల్గొన్నారు.



గానలహరి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళా సంస్థల ప్రతినిధులు

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన

నిత్యకల్యాణంలో పాల్గొన్న 86 జంటలు



హాజరైన భక్తులు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి చిత్రకూట మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించిన తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ వేడుకలో 86 జంటలు పాల్గొన్నాయి. ఇతర ఆర్జిత సేవల్లోనూ భారీగా హాజరైన భక్తులు స్వామివారి దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మృగశిర సంబురానికి ముకుతాడు

కొమరారం గుట్టల చెరువు వద్ద పోలీసుల పహారా



గుట్టల చెరువు వద్ద కాపలాగా ఉన్న పోలీసులు

ఇల్లెందురూరల్: మృగశిర కార్తె రోజున చేపలు తింటే మంచిదని అందరూ నమ్ముతారు. కానీ ఈ ఆనవాయితీకి ఇల్లెందు ఏజెన్సీలో మత్స్య శాఖ అధికారుల నిర్ణయం అడ్డుకట్ట వేసింది. మండలంలో సొసైటీలు లేని చెరువుల్లో చేపలు పట్టేందుకు గ్రామపంచాయతీల ద్వారా వేలం నిర్వహించేవారు. తద్వారా జీపీలకు ఆదాయం కూడా సమకూరేది. కానీ మూడేళ్ల క్రితం ఇల్లెందు ఏజెన్సీలోని కొన్ని జీపీల్లో చెరువులకు సొసైటీలు ఏర్పాటుచేయాలని మత్స్యశాఖ నిర్ణయించగా తమకు సమాచారం లేకుండా ఎంపిక చేశారని పోచారం తండా తదితర గ్రామాల ప్రజలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇక మృగశిరకార్తె సందర్భంగా శనివారం మండలంలోని కొమరారం ప్రజలు సమీపంలోని గుట్టల చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లగా అప్పటికే చేపల సొసైటీ ప్రతినిధులు మత్స్య శాఖ సహకారంతో పోలీసుల పహారా పెట్టించారు. ఈక్రమంలో ప్రజలను పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. ఏటా మాదిరిగా తాము చేపలు పట్టేందుకు వస్తే ఎందుకు అడ్డుకున్నారని నిలదీయగా చెరువును చేపల సొసైటీకి అప్పగించినందున వారి సూచనతో చేపలు పట్టడంపై ఆంక్షలు విధించినట్లు తెలిపారు. చివరకు వచ్చే ఏడాది నుంచి మృగశిర కార్తె తర్వాతే చెరువులో చేప పిల్లలు వదులుతామని సొసైటీ ప్రతినిధులు లేఖ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. ఈ విషయమై జిల్లా మత్స్య శాఖాధికారి బానోత్ వీరన్నను వివరణ కోరగా మండలంలోని కొమరారం, పోచారం తండా జీపీల్లో నిబంధనల ప్రకారమే సొసైటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. అయితే, కొమరారం గుట్టలచెరువులో సొసైటీ సభ్యులు ముందుగానే చేప పిల్లలు వదిలినందున ప్రజలు దిగకుండా తామే పోలీసుల రక్షణ కోరామని చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా పారదర్శకంగా సొసైటీల ఎంపిక చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం



వీసీలో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు

- జిల్లాలో ఏడు చెక్‌పోస్టుల ఏర్పాటు
- అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు

ఖమ్మంక్రైం: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యంగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు సమష్టిగా కృషిచేయాలని అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు సూచించారు. వ్యవసాయాధికారులు, పోలీస్ అధికారులతో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. నకిలీ విత్తనాలతో రైతాంగం నష్టపోయే ప్రమాదమున్నందున మార్కెట్‌లో ఎక్కడా అలాంటి విత్తనాల విక్రయాలు జరగకుండా పర్యవేక్షించాలని తెలిపారు. ఇప్పటికే అక్రమ రవాణా నియంత్రణకు జిల్లాలో ఏడు చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాగా, విత్తనాల కొరత లేదనే విషయమై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. దళారులు తక్కువ డబ్బుకు విత్తనాలు ఇస్తామని ప్రచారం చేసినా, బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నాసిరకం విత్తనాలు అంటగట్టినా కేసులు నమోదు చేయనున్నట్లు అడిషినల్ డీసీపీ తెలిపారు. రైతులు కూడా విత్తనాలు కొనుగోలు విషయంలో అప్రమత్తంగా ఉండేలా చూడాలని సూచించారు. ఈసమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, ఏడీఏలు శ్రీనివాస్, నర్సింహారావు, విజయచందర్, కరుణశ్రీ, శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ కిషోర్, సీఐ స్వామి తదితరులు పాల్గొన్నారు.

రూ.1.25లక్షల విలువైన గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపాన గంజాయితో వెళ్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ ఉదయ్‌కుమార్ కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ ప్రాంతానికి చెందిన లాలు రైటా శనివారం కోణార్క్ ఎక్స్‌ప్రెస్ దిగి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ముందు నుంచి వెళ్తున్నాడు. ఈమేరకు అనుమానంతో ఆయనను పోలీసులు తనిఖీ చేయగా బ్యాగ్‌లో రూ.1.25లక్షల విలువైన గంజాయి లభించింది. దీంతో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తికి గాయాలు

అశ్వాపురం: మండలంలోని గొందిగూడెం గ్రామ శివారులో గూడ్స్ రైలు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గొందిగూడెంనికి చెందిన మేకల కాపరి సున్నం సీతారాములు మేకలు కాసుకొని శనివారం సాయంత్రం ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గూడ్స్ రైలు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కేసులు నమోదు

ఇల్లెందు: భర్త, అత్త, మామ, ఇతర కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారని ఓ వివాహిత శనివారం ఇల్లెందు పోలీసులను ఆశ్రయించింది. పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన మౌనికను.. తన భర్త భాషిత్‌బాబు, అత్త, మామ, ఇతర కుటంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్నుస్తున్నారు. సీఐ కరుణాకర్ విచారించి కేసు నమోదు చేశారు.

సీసీ కెమెరాలు చోరీ..

సీసీ కెమెరాలనూ చోరీ చేసిన ఘటన ఇల్లెందులో చోటుచేసుకుంది. సుభాష్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఇబ్రహీంకు పట్టణంలోని 17వ నెంబర్‌బస్తీలోని తన ఇంటికి అమర్చిన రెండు సీసీ కెమెరాలను శుక్రవారం దుండగలు అపహరించారు. ఇబ్రహీం ఫిర్యాదుమేరకు శనివారం సీఐ కరుణాకర్ కేసు నమోదు చేశారు.

వృద్ధుడి మృతిపై...

ఇల్లెందురూరల్: మండలంలోని మాణిక్యారం గ్రామానికి చెందిన సూర్నపాక వీరభద్రయ్య గత నెల 30వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. నాటి నుంచి ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వాకబు చేస్తుండగా గుండాల మండలం వెన్నెలబైలు అటవీ ప్రాంతంలో విగతజీవిగా కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొమరారం ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖమ్మం అర్బన్: రెండు ఇళ్ల మధ్య పొత్తుగా ఉన్న పిట్ట గోడ కూలడంతో గాయపడిన వ్యక్తి చికిత్స మృతి చెందాడు. ఖమ్మంకు చెందిన చింతల అంజయ్య(63) ఇంటి సమీపాన నర్సింహారావు, వెంకటేశ్వర్లు పొత్తులో పిట్టగోడ ఉంది. ఈనెల 5న ఆ గోడ కూలడంతో అంజయ్య తీవ్రంగా గాయపడ్డాడని, హైదరాబాద్‌లో చికిత్స చేయిస్తుండగా మృతి చెందినట్లు ఆయన భార్య భూలక్ష్మి శనివారం ఖానాపురం హవేలీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఘటనపై విచారణ జరిపించాలని ఆమె కోరింది.

చికిత్స పొందుతున్న బీటెక్ విద్యార్థి...

పాల్వంచరూరల్ : బీటెక్ చదువుతున్న ఓ విద్యార్థి గతనెల 9న పురుగుమందు తాగగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెం రామాటాకీస్ ఏరియాకు చెందిన కుచెన వంశీ(27) పాల్వంచలోని కాంట్రాక్ట్ కాలనీలో నివాసం ఉంటూ బీటెక్ చదువుతున్నాడు. కొంత కాలంగా మద్యానికి అలవాటు పడి కళాశాలకు వెళ్లకుండా ఉండడంతో తల్లి సునిత మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన వంశీ మే 9న పురుగు మందు తాగి వాంతులు చేసుకుంటుండగా స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం, వరంగల్, హైదరాబాద్‌ల్లోని ఆస్పత్రులకు తీసుకెళ్లారు. కాగా, హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి మేనమామ మామిడాల మల్లికార్జున్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ రాము తెలిపారు.

'సింగభూపాలెం' చేపలు లేవు..

- మృగశిర కార్తెకు అందని వైనం..
- సైజు పెరగకపోవడమే కారణమంటున్న మత్స్యకారులు
- గతంలోనే 'సాక్షి' వెల్లడించినా.. కొట్టిపారేసిన అధికారులు



చేపలు పట్టకపోవడంతో వెలవెలబోతున్న సింగభూపాలెం చెరువు

సుజాతనగర్: మృగశిర కార్తె రోజున చేపలు తినడం వల్ల ఆరోగ్యానికి మంచిదనే అభిప్రాయం ఉండటంతో ప్రజలు చేపలు తినేందుకు ఆసక్తి చూపుతారు. మృగశిర కార్తె శనివారం వచ్చిన నేపథ్యంలో జిల్లా ప్రజలతో పాటుగా, సుజాతనగర్ మండల ప్రజలకు సింగభూపాలెం చెరువు చేపలు తినే భాగ్యం మాత్రం దక్కలేదు. మృగశిర కార్తె ప్రవేశం సందర్భంగా చెరువలో చేపలు పడతారని అందరూ భావించినా మత్స్యకారులు చేపలు పట్టకపోవడంతో చివరకు నిరాశే మిగిలింది. ఇతర ప్రాంతాలకు చెందిన చేపలను తెచ్చి మండల కేంద్రంలో విక్రయించడంతో రూ.40 నుంచి రూ.70 అదనంగా చెల్లించి మరీ చేపలు కొనాల్సిన పరిస్థితి నెలకొంది.

సైజు పెరగలేదా?

ఏటా సింగభూపాలెం చెరువులో ప్రభుత్వం నూరు శాతం సబ్సిడీతో 7.41 లక్షల చేపపిల్లలను పంపిణీ చేస్తోంది. ఇందులో భాగంగా సుమారు 10 నెలల కిందట 80 నుంచి 100 ఎమ్ఎమ్ సైజు కలిగిన చేప పిల్లలను చెరువులో వదిలారు. అయితే ప్రభుత్వం ఇచ్చే చేపపిల్లలు నాణ్యమైనవి కావని, అనుకున్నంత సైజు పెరగలేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన చేపపిల్లలు కాకుండా మత్స్యకారులు సొంతంగా 100 నుంచి 150 ఎమ్ఎమ్ సైజులో ఉన్న మరో లక్షన్నర చేపపిల్లలను చెరువులో వదిలారు. అయితే తాము సొంతంగా వేసిన చేపలు 800 గ్రాముల నుంచి కిలోలోపు బరువు పెరిగాయని, ప్రభుత్వం ఇచ్చిన చేపలు మాత్రం అరకిలో లోపే ఉన్నాయని మత్స్యకారులు అంటున్నారు.

ఎందుకు పట్టలేదు?

జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన సింగభూపాలెం చెరువు చేపలంటే అందరికీ సుపరిచితమే. ఇక్కడి చేపలు రుచికరంగా ఉండటంతో జిల్లాలోని ఆయా ప్రాంతాల వారు ఇక్కడకు వచ్చి మరీ చేపలు కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. ఈ ఏడాది చేపలు పట్టకపోవడంతో గత నెల 17న 'సాక్షి'లో 'ఈ ఏడాది చెరువులో చేపలు లేనట్టే...'కథనం ప్రచురితమైంది. జిల్లా మత్స్యశాఖాధికారులు 'సాక్షి'కథనంపై కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. చెరువులోని చేపలు 800 గ్రాముల నుంచి 2 కిలోల లోపు ఉన్నాయంటూ నివేదికలో తెలిపారు. అధిక పరిమాణం కలిగిన చేపలను మృగశిర కార్తె నుంచి పడుతామని కలెక్టర్‌కు ఇచ్చిన నివేదికలో తెలిపినా శనివారం (మృగశిర రోజున) చేపలు పట్టలేదు. చెరువులోని చేపలు 2 కిలోల బరువుంటే పట్టొచ్చు కదా? అని పలువురు అసహనం వ్యక్తం చేశారు. మత్స్యకారులు మాత్రం చేపల సైజు 200 నుంచి 500 గ్రాముల లోపే అని అంటుండగా.. 800 గ్రాముల నుంచి 2 కిలోల సైజు ఉన్నాయంటూ మత్స్యశాఖాధికారులు అంటున్నారు.

అక్కడ వెలవెల.. ఇక్కడ కళకళ

మృగశిర రోజున సింగభూపాలెం చెరువు చేపలను పట్టకపోవడంతో వెలవెలబోయింది. సుజాతనగర్ మండల కేంద్రంలో ఇతర ప్రాంతాలకు చెందిన వారు చేపలను తెచ్చి విక్రయించారు. కిలో చేపలను రూ.170 నుంచి రూ.180 మధ్య విక్రయించారు. చెరువు వద్ద చేపలు పట్టకపోవడంతో అధిక ధర చెల్లించి మరీ చేపలను కొనుగోలు చేశారు.